క్లుప్తంగా

వేడుకగా చండీ హోమం



చండీహోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు తదితరులు

నల్లకుంట: నల్లకుంట స్ట్రీట్ నంబర్ 13లో ఏర్పాటు చేసి దుర్గామాత మండపం వద్ద గురువారం చండీ హోమాన్ని నిర్వహించారు. అర్చక స్వామి అనంతాచారి నేతృత్వంలో జరిగిన ఈ పూజా అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక నేతలు నవీన్, కాలనీ పెద్దలు, బీఆర్‌ఎస్ నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రాణిగా శారదాంబ



శంకరమఠంలో ఇంద్రాణి అలంకరణలో శారదాంబ

నల్లకుంట: శారదా శరన్నవ రాత్రి ఉత్సవాల్లో ఐదో రోజైన గురువారం నల్లకుంట శంకరమఠంలో శారదాంబ ఇంద్రాణి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాద, అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం లయ కళావిపంచి పెరావలి జయభాస్కర్ బృందం ప్రదర్శించిన స్వరలయ స్వరవాద్య సమ్మేళనం ఆహూతులను ఆకట్టుకుంది. న్యూ నల్లకుంటలోని శ్రీ సీతా రామాంజనేయ సరస్వతి ఆలయంలో జయ లక్ష్మి దేవి అలంకరణలో దర్శనమిచ్చిన సరస్వతి మాత భక్తులకు కనువిందు చేశారు.

కాత్యాయనిగా అమ్మవారు



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చిక్కడపల్లిలోని నేతాజీ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారు గురువారం కాత్యాయని దేవీగా భక్తులకు దర్శనం ఇచ్చింది. నిర్వాహకులు పలుస బాలరాజుగౌడ్, కందూరి కృష్ణ, పి.రామకృష్ణగౌడ్, తమ్మన కృష్ణమూర్తి, దయానంద్, రాజగోపాల్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాద వితరణ చేపట్టారు.

ఉద్యోగాల భర్తీని విస్మరించిన పార్టీలను ఓడిస్తాం: కృష్ణయ్య



మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ(హైదరాబాద్): నిరుద్యోగులకు ఉద్యోగాల భర్తీని విస్మరించే పార్టీలను అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తుగా ఓడిస్తామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన గురువారం కాచిగూడ అభినందన్ గ్రాండ్‌లో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల ఎన్నికల మేనిఫెస్టోలో నిరుద్యోగ ఖాళీల ప్రస్తావన ఎక్కడ? అని కృష్ణయ్య ప్రశ్నించారు. రాజకీయ పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలు ప్రకటిస్తున్నాయి కానీ ఉద్యోగ ఖాళీల భర్తీ విషయంలో నిరుద్యోగ సమస్య పరిష్కారం ఎలా చేస్తారో చెప్పడం లేదన్నారు. రాష్ట్రంలో 25 లక్షల మంది నిరుద్యోగ, ఉద్యోగ ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఉద్యోగులు లేక ప్రభుత్వ కార్యాలయాలు ఖాళీ కుర్చీలతో వెలవెలబోతున్నాయన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు 50 శాతం సీట్లు కేటాయించాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలన్నారు. కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేశ్ పాల్గొన్నారు.

డెలివరీ బాయ్‌పై దాడి: వ్యక్తిపై కేసు నమోదు

కాచిగూడ: మద్యం మత్తులో డెలివరీ బాయ్‌పై ఓ వ్యక్తి దాడి చేశాడు. కాచిగూడ ఎస్‌ఐ డి.సుభాష్ సమాచారం మేరకు... అంబర్‌పేట ప్రాంతానికి చెందిన అహ్మద్ కుమారుడు షేక్ యూనిస్ (25) ప్రైవేట్ డెలివరీ బాయ్. రత్నానగర్ సమీపంలో షేక్ యూనిస్ ఫోన్ మాట్లాడుతుండగా అదే సమయంలో నాగోల్ జైపూర్ కాలనీకి చెందిన పర్తిగారి గోపాల్ (30) పీకల వరకు మద్యం సేవించి కంకర యాతతో షేక్ యూనిస్ తలపై కొట్టాడు. దీంతో షేక్ యూనిస్ తలకు తీవ్రంగా గాయమైంది. బాధితుడు ఫిర్యాదు మేరకు గురువారం గోపాల్‌పై కేసు నమోదు చేసి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

బీజేపీ ఫస్ట్ లిస్ట్‌లో ముషీరాబాద్ డౌటే?

పోటీ తీవ్రంగా ఉండడమే కారణం

తెరపైకి లోకల్ నినాదం



బండారు విజయలక్ష్మి



సి.గోపాల్‌రెడ్డి



డి.ఎస్.రెడ్డి

ముషీరాబాద్: నేడో.. రేపో ప్రకటించే బీజేపీ తొలి జాబితాలో ముషీరాబాద్ అభ్యర్థి పేరు ఉంటుందా? లేదా? అనే విషయంపై కూడా సందిగ్ధత నెలకొంది. అభ్యర్థుల మధ్య పోటీ తీవ్రంగా ఉండటం ఎవరికి వారు తమకు తెలిసిన నేతలపై ఒత్తిడి పెంచుతుండడంతో అధిష్టానం కూడా ఒక నిర్ణయానికి రాలేకపోతుంది. దీనికి తోడు గత 2–3 రోజుల నుంచి డాక్టర్ కె.లక్ష్మణ్ కూడా పోటీ చేసే అవకాశం లేకపోలేదనే ప్రచారం సాగుతుంది. ఈ నేపథ్యంలో మొదటి జాబితాలో ముషీరాబాద్ అభ్యర్థిని ప్రకటించకపోవచ్చు అని బీజేపీ నేతలు కొందరు అభిప్రాయపడుతున్నారు.

> ముషీరాబాద్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి పేరు ప్రకటించడంలో ఆలస్యం జరుగుతుండటంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఒకింత అసహనానికి గురవుతున్నారు. ఒకవైపు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించడంతో వారు ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. దీంతో బీజేపీ నేతలు అభ్యర్థి పేరు ప్రకటనపై ఆశగా ఎదురు చూస్తున్నారు.

- ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి బీజేపీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ఆశావహులతో బీజేపీ నగర కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఆ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, డాక్టర్ కె.లక్ష్మణ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఆశావహులకు దిశానిర్దేశం చేశారు. అధిష్టానం తీసుకునే నిర్ణయానికి అందరు కట్టుబడి ఉండాలని అధిష్టానం కుల, డబ్బు, పలుకుబడి తదితర అంశాలన్నింటినీ పరిగణలోకి తీసుకొని అభ్యర్థిని నిర్ణయం తీసుకుంటుందని తెలిపినట్లు తెలిసింది. దీనికి అందరు సమన్వాయం పాటించాలని అందరం కలిసి ముషీరాబాద్‌లో బీజేపీ జెండా ఎగరవేయడమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని కోరినట్లు సమాచారం.
- స్థానిక సీనియర్ బీజేపీ నాయకులు సి.కె.శంకర్, రాంరెడ్డి, నైశదం సత్యనారాయణమూర్తి, రాజు, నందు తదితరులు చాలా సంవత్సరాలుగా పార్టీ కోసం కష్టపడి పని చేసే వారికే టికెట్ కేటాయించాలని రాత్రికి రాత్రి వచ్చే వారికి టికెట్లు ఇవ్వ వద్దు అని కోరినట్లు సమాచారం. స్థానిక నేతలకు ఎవరికి ఇచ్చినా అందరం కలిసి పని చేసి గెలిపించుకుంటామని చెప్పినట్లు తెలిసింది. అయితే అధిష్టానం కూడా మీ అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. సమావేశంలో సి.గోపాల్‌రెడ్డి, బండారు విజయలక్ష్మి, జి.ఎస్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరి మధ్యే ప్రధాన పోటీ...

రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ పోటీ చేయకుంటే హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె బండారు విజయలక్ష్మి టికెట్ కోసం గట్టిగా పట్టుబడుతున్నట్లు తెలుస్తుంది. ఆర్‌ఎస్‌ఎస్‌లో అనేక సంవత్సరాలుగా పని చేస్తూ డాక్టర్ కె.లక్ష్మణ్ ప్రతి ఎన్నికల్లో తెరవెనుక ఉండి ప్రధాన భూమిక పోషించే సి.గోపాల్‌రెడ్డి కూడా తనదైన శైలిలో టికెట్ కోసం ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. మరోవైపు స్థానికులలో ఒకరికి టికెట్ కావాలని కోరుతున్నారు. ప్రధానంగా విజయలక్ష్మి, గోపాల్‌రెడ్డిల మధ్య ప్రధాన పోటీ ఉండే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

అనూహ్యంగా తెరపైకి డీఎస్ రెడ్డి...

ముషీరాబాద్ నియోజకవర్గం జవహర్‌నగర్‌కు చెందిన, ఎయిర్‌ఫోర్స్‌లో గత 20 సంవత్సరాలుగా పని చేసి పదవీ విరమణ పొందిన డి.ఎస్.రెడ్డి అనూహ్యంగా తెరపైకి వచ్చారు. ప్రస్తుతం ఆయన సాయి గ్రూప్స్ అధినేతగా పలు వ్యాపార రంగాల్లో ఉన్నారు. ఆయనకు జాతీయ స్థాయిలో సెక్యూరిటీ విభాగం నుంచి పలువురి మద్దతు కూడగడుతున్నారు. ఆయన కూడా టికెట్ కోసం తీవ్రంగానే ప్రయత్నిస్తున్నారు.

జంగ్ తెలంగాణ 2023

బీఆర్‌ఎస్‌కు హ్యాట్రిక్ విజయం అందించాలి

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కాలేరు



రత్నానగర్‌లో కాలేరు వెంకటేష్‌కు హారతులిస్తున్న మహిళలు

నల్లకుంట: ప్రజా సంక్షేమం కోసం పెద్ద పీట వేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని అంబర్‌పేట నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కాలేరు వెంకటేష్ ప్రజలను కోరారు. బుధవారం సాయంత్రం నల్లకుంట డివిజన్ రత్నానగర్, సత్యానగర్, శివానందనగర్‌లలో బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కాలేరు రత్నానగర్, శివానంద్‌నగర్‌లలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు మంగళ హారతులతో ఎమ్మెల్యే అభ్యర్థి కాలేరుకు స్వాగతం పలికారు. కాలేరు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అదే విధంగా నియోజకవర్గంలో తాను చేపట్టిన అభివృద్ధి పనులను ఓటర్లకు వివరించారు. బీఆర్‌ఎస్ నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, నాయకులు ఇర్ఫాన సుల్తాన, క్రిసోలైట్, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

బీజేపీ, కాంగ్రెస్ నేతల మాయమాటలు నమ్మొద్దు

ఎమ్మెల్యే ముఠా గోపాల్



నజీర్ ఆయన అనుచరులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నేతలు ప్రజలను మభ్యపెడుతూ ఎన్నికల్లో ఎలాగైనా గెలువాలనే తపనతో ఆచరణకు అమలు కాని హామీలు ఇస్తున్నారని ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆరోపించారు. అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌ని గెలిపించాలని కోరారు. గురువారం సాయంత్రం భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో రంగానగర్‌లో ఏర్పాటు చేసిన సభలో ప్రముఖ సంఘ సేవకులు నజీర్, సద్దాంతో పాటు కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన వంద మంది నేతలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నేతలకు కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... గత ఐదు ఏళ్లల్లో నియోజకవర్గంలో కోట్లాది రూపాయలు వెచ్చించి అనేక జఠిలమైన సమస్యలను పరిష్కరించామని పేర్కొన్నారు. భోలక్‌పూర్‌లో రూ. 24 కోట్లతో అధ్వానంగా మారిన డ్రైనేజీ సమస్యను పరిష్కరించడంతో పాటు జఠిలంగా ఉన్న కలుషిత నీటి సమస్యను సైతం పరిష్కరించామని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువజన విభాగం నగర నాయకులు ముఠా జైసింహ, మైనార్టీ కమిటీ రాష్ట్ర నాయకులు షరీఫ్, రహీం, పార్టీ సీనియర్ నాయకులు రెబ్బ రామారావు, జునేద్‌బాగ్దాదీ, డివిజన్ ఉపాధ్యక్షులు శంకర్‌గౌడ్, డివిజన్ బీసీ సెల్ అధ్యక్ష, కార్యదర్శులు ఉమాకాంత్, ఆర్.శ్రీనివాస్, డివిజన్ మైనార్టీ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మగ్బూల్, జబ్బార్, నాయకులు మున్వర్‌చాంద్ తదితరులు పాల్గొన్నారు.

‘ఫీవర్’లో ఘనంగా బతుకమ్మ సంబురాలు



బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం

నల్లకుంట: తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎంహెచ్‌ఈయూ) ఆధ్వర్యంలో గురువారం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి ఆవరణలో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. దీనికి హాజరైన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శంకర్, సీఎస్ ఆర్‌ఎంవో డాక్టర్ జయలక్ష్మి, డిప్యూటీ ఆర్‌ఎంవో డాక్టర్ చంద్ర శేఖర్, సివిల్ సర్జన్ డాక్టర్ కొండల్ రెడ్డి, డాక్టర్ హరిత, టీఎంహెచ్‌ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోఖ్, ఏవో మోహన్ దాస్, ఆఫీస్ సూపరింటెండెంట్ యాదిలాల్ తదితరులు మహిళలతో కలిసి దాండియా ఆడారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో గల నీటి కొలనులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. టీఎంహెచ్‌ఈయూ ఆస్పత్రి శాఖ అధ్యక్షురాలు లావణ్య, ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్, ఉపాధ్యక్షుడు సతీష్, జనార్ధన్, కోశాధికారి శ్రీకాంత్, నాయకులు పద్మజ, సుజాత, గోపి కృష్ణ, మౌనిక, భాగ్యలక్ష్మి, లక్ష్మి పాల్గొన్నారు.



బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

‘అవంతి’లో బతుకమ్మ సంబురం

బర్కత్‌పుర: బతుకమ్మ వేడుకలను అవంతి డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం కనుల పండువగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి రంగు రంగుల పూలతో బతుకమ్మను పేర్చి చుట్టూ తిరుగుతూ ఆడి పాడుతూ సందడి చేశారు. కళాశాల డైరెక్టర్ వెంకట్ రావు, ప్రిన్సిపాల్ వీర సోమయ్య, కళాశాల హెచ్‌ఆర్ డైరెక్టర్ జయప్రద పాల్గొన్నారు. వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

అంబర్‌పేట: అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్స్‌లో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. గురువారం రాత్రి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి ఎమ్మెల్యే దాండియా ఆడారు.



ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకోవాలి

ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి: ప్రతి ఒక్కరూఆధ్యాత్మిక భావనను పెంపొందించుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. గాంధీనగర్ వై జంక్షన్ వద్ద జై శేరావలి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఇ.సాయి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రాకేష్‌కుమర్, ముచ్చకుర్తి ప్రభాకర్, మారిశెట్టి నర్సింగ్ రావు, బీజేపీ నాయకులు ఎ.వినయ్‌కుమార్, చెర్ల గోపాల్‌రెడ్డి, జయేంద్రబాబు, అసోసియేషన్ సభ్యులు దయానంద్, సోనులాల్, ఆనంద్, శేఖర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బాపూనగర్‌లో...

గాంధీనగర్ డివిజన్ చిక్కడపల్లి బాపూనగర్‌లోని శ్రీ రాజరాజేశ్వరి దేవీ ఆలయంలో గురువారం అమ్మవారికి సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు. బీజేపీ నగర నాయకులు ఎ.వినయ్‌కుమార్, నాయకులు రత్నసాయిచంద్, శ్రీకాంత్, సత్తిరెడ్డి, రాజేందర్, ఆలయ పూజారులు సాయితేజ పాల్గొన్నారు.



గాంధీనగర్‌లో అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

‘చౌకబారు ఆరోపణలు మానుకోవాలి’



మాట్లాడుతున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి దంపతులు

అంబర్‌పేట్: డబ్బులు తీసుకొని బీజేపీ నుంచి బీఆర్‌ఎస్ పార్టీలో చేరామని తమపై చేస్తున్న చౌకబారు ఆరోపణలు మానుకోవాని బాగ్ అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మవెంకట్‌రెడ్డి దంపతులు తెలిపారు. గురువారం డీడీ కాలనీలోని వారి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పద్మా వెంకట్‌రెడ్డి, ఆమె భర్త వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ నేతలే డబ్బు తీసుకొని పార్టీ మారారని చెప్పడం అన్యాయం అన్నారు. తమపై ఆరోపణలు చేసిన నేతలు ఏ గుడివద్దకైనా ప్రమాణానికైనా వస్తే తాము సిద్ధమే అన్నారు. 40 ఏళ్లుగా బీజేపీ పార్టీలో నిబద్ధతతో పనిచేశామని ఎక్కడ డబ్బుతో పనిచేయలేదన్నారు. ఏ పార్టీలో ఉన్నా తాము సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేసే వ్యక్తిత్వం తామదని స్పష్టం చేశారు. బీజేపీలో ఓడిపోయే సీట్లు తమకు ఇచ్చి న్యాయం చేశామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో సహా పలువురు స్థానిక నేతలు చెప్పడం దారుణమన్నారు. తనకు డబ్బుపై పెద్దగా ఆసక్తి లేదని డబ్బులు తీసుకొని పార్టీలు మారే వ్యక్తిత్వం కాదని తమపై ఆరోపణలు చేసే వారు గమనించాలన్నారు. తమపై చౌకబారు ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం



హోమంలో పాల్గొన్న నేతలు

ముషీరాబాద్: కాంగ్రెస్ పార్టీ ముషీరాబాద్ నియోజకవర్గ ఎన్నికల కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. గోల్కొండ చౌరస్తాలో పెట్రోల్ బంక్ వద్ద ఉన్న ఓ కంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా హోమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎం.అంజన్‌కుమార్‌యాదవ్, సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ మాజీ కార్పొరేటర్లు ఆర్.కల్పనయాదవ్, వాజీద్‌హుస్సేన్, ఏ, బీ బ్లాక్ అధ్యక్షులు, ఆరు డివిజన్‌ల అధ్యక్షులతో పాటు పలువురు సీనియర్ కాంగ్రెస్ నేతలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

బీజేపీకే ప్రజల మద్దతు

చిక్కడపల్లి: ముషీరాబాద్ నియోజకవర్గం ప్రజలు బీజేపీ మద్దతు పలుకుతున్నారని కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా గురువారం చిక్కడపల్లి, బాపూనగర్ తదితర ప్రాంతాలలో స్థానిక నేతలతో కలసి ఆమె ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... ప్రధాని నరేంద్రమోదీ అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నారన్నారు. నాయకులు ఎ.వినయకుమార్, రత్నసాయిచంద్, శ్రీకాంత్, ఉమేష్, సత్తిరెడ్డి, ఆకుల సురేందర్, రాజేందర్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



ఇంద్రసేనారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

అంబర్‌పేట్: త్రిపుర గవర్నర్‌గా నియమితులైన బీజేపీ నేత ఇంద్రసేనారెడ్డికి పలువురు బీజేపీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఆయన నివాసంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, ఇతర పార్టీ నేతలు పుష్ప గుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. బీజేపీ నేతలు రాములు, శ్యామ్‌రాజ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



ఇంద్రసేనారెడ్డిని అభినందిస్తున్న ముషీరాబాద్ బీజేపీ నేతలు

ముషీరాబాద్: త్రిపుర రాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన నల్లు ఇంద్రసేనారెడ్డిని గురువారం బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సూర్యనారాయణశర్మ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బి.సుబ్రహ్మణ్యం, డివిజన్ మాజీ అధ్యక్షుడు సాయికృష్ణయాదవ్, ఎన్‌ఆర్‌ఐ రోయ్యూరి శేషసాయి, వంశీ, గౌరీశంకర్, వెంకటరామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల వేధింపులపై హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

నాంపల్లి: ప్రవళిక ఆత్మహత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న శివరాం రాథోడ్ ఆచూకీ తెలపాలని చిక్కడపల్లి పోలీసులు వేధింపులకు గురిచేస్తున్నారంటూ బంధువులు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. పరారీలో ఉన్న శివరాం రాథోడ్ ఆచూకీ చూపాలంటూ తమను పోలీసు స్టేషన్‌కు పిలిపించి మానసికంగా మనోవేదనకు గురిచేయడంతో పాటుగా ఆచూకీ తెలుపకపోతే ఎన్‌కౌంటర్ చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదు చేశారు. శివరాం రాథోడ్ ఆచూకీ తెలుసుకోవాల్సిన పోలీసులు... తమను ఇబ్బందులకు గురిచేసి ఆచూకీ అడగడం దారుణమని అన్నారు. ఒక వేళ శివరాం రాథోడ్ ఆచూకీ తెలిస్తే పోలీసులకు తప్పనిసరిగా తెలియజేస్తామని, పోలీసుల విచారణకు సహకరిస్తామని చెప్పినా పోలీసులు తమను వేధిస్తున్నారని ఆరోపించారు. తమ కుటుంబ సభ్యులకు చిక్కడపల్లి పోలీసుల నుంచి ప్రాణహాని ఉందని, తమకు రక్షణ కల్పించాలని మానవ హక్కుల కమిషన్‌ను వేడుకున్నారు.

కనుల పండువగా శరన్నవరాత్రి ఉత్సవాలు

అంబర్‌పేట్: దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగా వైభవంగా జరుగుతున్నాయి. గురువారం అంబర్‌పేట నియోజకవర్గ వ్యాప్తంగా అమ్మవారి ఆలయాలు, మండపాల వద్ద శరన్నవరాత్రి వేడుకలు కనులపండువగా నిర్వహిస్తున్నారు. మహంకాళి ఆలయంలో అమ్మవారు లలిత త్రిపుర సందరీ దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో హోమాలు, కుంకుమ అర్చన వైభవంగా జరిగాయి. అలాగే బతుకమ్మ కుంటలోని మైసమ్మ ఆలయంలో అమ్మవారు ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనిమిచ్చారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

కాచిగూడ: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం ఐదోరోజు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా డాక్టర్ ఎన్.గౌతంరావు, కోశాధికారి ఎ.సూర్యప్రకాష్ సింగ్, జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు, జై అంబే భవాని యూత్ అసోసియేషన్ ప్రతినిధులు కుమారస్వామి, గౌతం, సుజాత, సరిత, మాధవి, సంగీత, మమత తదితరులు పాల్గొన్నారు.



కుత్బిగూడలో జై అంబే భవానీ యూత్ అసోసియేషన్...



బతుకమ్మకుంట అమ్మవారి ఆలయంలో ధనలక్ష్మిగా...



లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కనకాల కట్టమైసమ్మ ఆలయంలో...



బర్కత్‌పుర చమన్ వద్ద బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతంరావు



చెప్పల్‌బజార్‌లో జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు



పటేల్‌నగర్ చౌరస్తాలో...